క్లుప్తంగా

నేటి నుంచి ఆధార్ ప్రత్యేక శిబిరాలు

ఉండ్రాజవరం: మండలంలో సోమవారం నుంచి ఆధార్ ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నట్టు ఎంపీడీఓ ఎ. శ్రీనివాసు ఆదివారం తెలిపారు. ఈనెల 27న వడ్లూరు, 28, 29 తేదీల్లో సత్యవాడ సచివాలయాల్లో ఈ శిబిరాలు నిర్వహిస్తారన్నారు. ఈ క్యాంపుల్లో ఆధార్ సేవలు, ఆధార్ మొబైల్ నంబర్ లింకేజీ, బయోమెట్రిక్, పుట్టినరోజు తేదీ మార్పు, ఆధార్ అప్డేట్ వంటి మార్పులు చేస్తారన్నారు.

సాయి సచ్చరిత్ర పఠనంపై సత్సంగం



సాయి సచ్చరిత్ర పఠనంపై సత్సంగం చేస్తున్న దృశ్యం

తాళ్లపూడి: సద్గురువులు, సత్పురుషుల చరిత్రలు చదవడం, బోధనలు వినడం వల్ల మన మనస్సుల్లోని మాలిన్యాలు తొలగిపోయి మంచి జీవన విధానం, ప్రాపంచిక జ్ఞానం పొందవచ్చని సాయి భక్తుడు సుబ్రహ్మణ్యేశ్వర రెడ్డి పేర్కొన్నారు. సాయి సచ్చరిత్ర పఠనంపై సాయి సేవాదళ్ ఆధ్వర్యంలో తాళ్లపూడిలోని సాయిబాబా ఆలయం వద్ద ఆదివారం సత్సంగ్ నిర్వహించారు. గుంటూరు నుంచి వచ్చిన సుబ్రహ్మణ్యేశ్వర రెడ్డి, శ్రీశైలం నుంచి వచ్చిన సాయిదాసు ప్రసంగించారు. శ్రద్ధ, ఓర్పు, సహనం, విశ్వాసం , నిస్వార్థం సాయిబాబా తత్వాలన్నారు. ఈ సందర్భంగా పలువురిని సేవాదళ్ సభ్యులు సత్కరించారు. కార్యక్రమంలో టీటీడీ ధర్మ ప్రచారక్ పరస రాధాకృష్ణ, సింహాద్రి జనార్దనరావు, కాళ్ల రత్నాజీ, సేవాదళ్ సభ్యులు, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

తాళ్లపూడి: ఇటీవల కురిసిన అకాల వర్షాలకు పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని మాజీ ఎమ్మెల్యే, జనసేన నాయకుడు టీవీ రామారావు కోరారు. ఆ పార్టీ నాయకులతో కలసి ఆదివారం ఆయన మండలంలోని మలకపల్లిలో దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడారు. మొక్కజొన్న, టమాట పంటలు తీవ్రంగా నష్టపోయాయని ఆ గ్రామ రైతులు అంబటి శ్రీనివాస్, గంగిరాజు వెంకటేష్, గెడ్డం నరసింహమూర్తి తదితరులు ఆయనకు వివరించారు. కార్యక్రమంలో జనసేన పార్టీ మండల శాఖ అధ్యక్షుడు గంటా కృష్ణ, నాయకులు రాగు వీర్రాజు, జెట్టి బంగారయ్య, పోతుల దుర్గాప్రసాద్, తాతారావు, సంగాడి రాము, నేలపాటి పద్మ, నామన బూరయ్య, చెవ్వూరి రాము తదితరులు పాల్గొన్నారు.

ఆటో బోల్తా



ఏటిగట్టు పై నుంచి బోల్తాపడిన ఆటో

సీతానగరం: మండలంలోని సింగవరం వద్ద ఆదివారం ఆటో బోల్తాపడి నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి. ముందు వెళుతున్న వాహనాన్ని ఓవర్‌టేక్ చేసే సమయంలో అదుపు తప్పి ఏటిగట్టుపై నుంచి కిందకు ఆటో బోల్తా కొట్టింది. ఈ ఘటనలో ఆటో డ్రైవర్ చిరంజీవి, ప్రయాణికులు వెంకట్రావు, ఈ.మహేష్, కండ్రెల్లి సత్యనారాయణకు గాయాలయ్యాయి. క్షతగాత్రులకు 108 అంబులెన్స్ ఏఎంటీ ముత్యం శ్రీనివాస్, పైలట్ విజయ్ కుమార్ ప్రథమ చికిత్స చేసి, రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. నిడదవోలు మండలం సమిశ్రగూడెంలోని లోహిణి నగర్‌కు చెందిన వీరందరూ దేవీపట్నం మండలం గండిలో కొలువైన పోశమ్మను దర్శించుకుని, తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది.

రీజినల్ మీట్‌లో దూబచర్ల లయన్స్ క్లబ్‌కు ప్రశంసలు



క్లబ్ అధ్యక్షుడు శ్రీనివాసరావును అభినందిస్తున్న లయన్స్ క్లబ్ రీజినల్ చైర్మన్ చెన్నకేశవరెడ్డి

నల్లజర్ల: సేవా కార్యక్రమాల నిర్వహణలో లయన్స్ క్లబ్ దూబచర్ల శాఖ ముందంజలో ఉందని ఆ క్లబ్ రీజినల్ చైర్మన్ చెన్నకేశవరెడ్డి ప్రశంసించారు. ఏలూరు జిల్లా చింతలపూడి మండలంలోని ఎర్రంపల్లిలో ఆదివారం నిర్వహించిన రీజినల్ మీట్‌లో దూబచర్ల క్లబ్ అధ్యక్షుడు అంబటి శ్రీనివాసరావును అభినందిస్తూ జ్ఞాపిక అందజేశారు. గత 318 రోజులుగా నిర్వహిస్తున్న నిత్యాన్నదాన కార్యక్రమాన్ని రీజినల్ చైర్మన్ అభినందించారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులను లయన్స్ సీనియర్ సభ్యులు తాతిన సత్యనారాయణ, కూచిపూడి ఉదయభాస్కరరావు, ఆచంట సత్యనారాయణ, డాక్టరు బద్రి వీరశేఖర్ తదితరులు అభినందించారు.

ఆదుకొంటున్న ఆసరా

- నియోజకవర్గంలో 50 వేల మంది మహిళలకు లబ్ధి
- మూడో విడతలో రూ. 46.31 కోట్ల రుణమాఫీ
- ఏప్రిల్ 5 వరకూ ఆసరా సంబరాలు



ఖండవల్లిలో ఆసరా చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు (ఫైల్)

పెరవలి: ఆర్థికంగా ఇతరులపై ఆధార పడకుండా మహిళలు స్వశక్తితో జీవించేలా వారిని ప్రోత్సహించేందుకు 'వైఎస్సార్ ఆసరా' పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం రూపొందించింది. స్వయం సహాయక సంఘాల్లో సభ్యులైన మహిళలు తీసుకున్న రుణాల విడతల వారీ మాఫీకి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇప్పటికే రెండు విడతల్లో అక్కచెల్లెమ్మలకు మాఫీ సొమ్మును అందజేశారు. తాజాగా శనివారం నుంచి మూడో విడతలో రుణమాఫీ సొమ్మును విడుదల చేస్తున్నారు. ఏప్రిల్ ఐదో తేదీ వరకూ ఈ కార్యక్రమం కొనసాగుతుంది.

ఆసరా సంబరాలు ప్రారంభం

ఈ క్రమంలో ఆదివారం నుంచి వాడవాడలా ఆసరా సంబరాలను అధికారులు ప్రారంభించారు. అన్ని ప్రాంతాల్లో 'గడప గడపకూ ఆసరా' పేరుతో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఏప్రిల్ ఐదో తేదీ వరకూ ప్రజలకు, మహిళలకు వైఎస్సార్ ఆసరా పథకం గురించి వివరిస్తారు. రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున మహిళలకు చేస్తున్న ఆర్థిక సాయంపై గ్రామాల్లోను, పట్టణాల్లోనూ అవగాహన కల్పిస్తున్నారు.

ఆసరా పథకం కింద నిడదవోలు నియోజకవర్గంలో 47,792 మందికి లబ్ధి చేకూరుతోంది. వీరందరూ అర్హతను బట్టి రూ.10 వేల నుంచి రూ.30 వేల వరకూ రుణం పొందారు. ఈ మొత్తాలతో వీరంతా వివిధ రకాలైన చిన్నచిన్న వ్యాపారాలు చేపట్టి ఆదాయం పొందుతూ తమ కుటుంబాలకు అండగా నిలుస్తున్నారు.

ఆసరా పథకం మూడో విడతలో నిడదవోలు నియోజకవర్గంలో 4,815 గ్రూపులకు చెందిన 47,792 మంది లబ్ధిదారులకు రూ.46.31 కోట్లు మొత్తం ఏప్రిల్ ఐదో తేదీలోగా అందనుంది. దీనిపై డ్వాక్రా మహిళల్లో ఆనందం వ్యక్తమవుతోంది.

నియోజకవర్గంలో ఏ మండలానికి ఎంతెంత

మండలం	గ్రూపులు	లబ్ధిదారులు	సొమ్ము (రూపాయల్లో)
పెరవలి	1531	15,346	18,64,94,617
నిడదవోలు రూరల్	1438	14,217	12,02,09,944
ఉండ్రాజవరం	1300	12,769	11,36,75,366
నిడదవోలు టౌన్	546	5460	4,26,71,000

ఫ్యాన్సీ షాపుతో కుటుంబానికి అండగా..



ఆసరా పథకంలో రూ.18 వేల రుణం తీసుకున్నాను, ఫ్యాన్సీ షాపు పెట్టాను. ఆర్థికంగా బాగానే ఉంది, కుటుంబానికి చేదోడుగా ఉండడంతో హాయిగా జీవిస్తున్నాం. ఇదంతా జగనన్న చలువే.

– పాలకొల్లు శ్రీవల్లి, లబ్ధిదారు, కానూరు, పెరవలి మండలం

రోజుకు రూ.300 సంపాదన



ఆసరా పథకంలో రూ.24 వేల రుణం తీసుకుని కిళ్లీషాపు పెట్టాను.ఖర్చులు పోను రోజుకు రూ.200 నుంచి రూ.300 సంపాదిస్తున్నాను. ఆసరా పథకం మమ్మల్ని ఆర్థికంగా ఆదుకుంది.

– బి దుర్గాదేవి, లబ్ధిదారు, కానూరు, పెరవలి మండలం

అల్పాదాయ వర్గాలకు అదనపు ఆదాయం



ఆసరా పథకం వేలాది మంది అల్పాదాయ వర్గాలకు అదనపు ఆదాయంగా మారింది. ఈ పథకంలో నియోజకవర్గంలో ఇప్పటి వరకూ 50 వేల మంది రుణం పొంది చిరు వ్యాపారాలు చేసుకుంటున్నారు. చిరు వ్యాపారుల ముఖాల్లో సంతోషం చూసినపుడు మనసుకు ఆనందం కలుగుతుంది.

– జి శ్రీనివాస్ నాయుడు, ఎమ్మెల్యే నిడదవోలు

రాగిజావ, చిక్కీల పంపిణీ వేళల్లో మార్పు

నిడదవోలు రూరల్: పాఠశాలల్లో విద్యార్థులకు రాగిజావ, చిక్కీల పంపిణీ వేళల్లో మార్పు చేసినట్టు ఎంఈఓ డి.కిషోర్‌కుమార్ ఆదివారం తెలిపారు. ఈనెల 21 నుంచి రాగిజావను ఉదయం 8.45 గంటలకు పంపిణీ చేస్తున్నారని తెలిపారు. ఇకపై రాగిజావను ప్రాథమిక పాఠశాలల్లో ఉదయం 10.35 గంటలకు, ఉన్నత పాఠశాలల్లో 10.45 గంటలకు పంపిణీ చేయాలని ఆదేశించారు. రాగిజావ తాగేందుకు విద్యార్థులకు 10 నిమిషాల సమయం ఇవ్వాలని సూచించారు. చిక్కీ లేని రోజులైన మంగళ, గురు, శని వారాల్లో రాగిజావను పంపిణీ చేయాలన్నారు. ఇప్పటి వరకూ చిక్కీలు మధ్యాహ్న భోజన సమయంలో ఇచ్చేవారని, ఇకపై విద్యార్థులకు సౌకర్యవంతంగా ఉండేలా సాయంత్రం పాఠశాల నుంచి బయటకు వచ్చే సమయంలో అందించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసినట్టు ఎంఈఓ కిషోర్‌కుమార్ వివరించారు.

పాలంగి పంచాయతీకి రిఫ్రిజిరేటర్, ఏసీ అందజేత

ఉండ్రాజవరం: పాలంగి పంచాయతీ కార్యాలయానికి అదే గ్రామానికి చెందిన బొక్క శివకుమార్ రూ.72 వేల విలువైన రిఫ్రిజిరేటర్, ఎయిర్ కండిషనర్‌ను విరాళంగా అందించినట్టు ఈఓపీఆర్డీ ముత్యం వీరాస్వామినాయుడు ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా వీరానాయుడు, పంచాయతీ కార్యదర్శి హసన్ జానీతో పాటు పంచాయతీ సభ్యులు దాత శివకుమార్‌ను అభినందించారు. శివకుమార్ మాట్లాడుతూ వేసవిని దృష్టిలో ఉంచుకుని పంచాయతీకి వచ్చే అధికారులు, ప్రజలకు ఉపయోగపడే విధంగా వీటిని అందజేసినట్టు తెలిపారు.

మహిళల ఆర్థిక వికాసానికి సంక్షేమ పథకాలు

- గోపాలపురం ఎమ్మెల్యే వెంకట్రావు
- లబ్ధిదారులకు ఆసరా నమూనా చెక్కు అందజేత
- సీఎం జగన్ చిత్ర పటానికి పాలాభిషేకం



నల్లజర్లలో డ్వాక్రా మహిళలకు ఆసరా నమూనా చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు



కార్యక్రమానికి హాజరైన మహిళలు

నల్లజర్ల: మహిళల ఆర్థిక వికాసం లక్ష్యంగా ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. వైఎస్సార్ ఆసరా పథకం మూడో విడత సొమ్ము పంపిణీకి నల్లజర్ల హైస్కూల్ మైదానంలో ఆదివారం సాయంత్రం ఆయన శ్రీకారం చుట్టారు. మహిళలకు ఆయన నమూనా చెక్కు అందజేశారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో మూడో విడత ఆసరా పథకం కింద 18,213 సంఘాలకు రూ.70 కోట్ల సొమ్ము సభ్యుల ఖాతాలకు జమ అయ్యాయన్నారు. నల్లజర్ల మండలంలో 1621 గ్రూపులకు రూ.15.78 కోట్ల మేర ప్రయోజనం చేకూరిందన్నారు. మహిళలు స్వశక్తితో ఎదగాలన్నదే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆశయమన్నారు. మహిళలు అన్ని రంగాలలో ముందంజ వేసేందుకు ప్రభుత్వం అండగా నిలుస్తుందన్నారు. లబ్ధిపొందిన మహిళలు సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతూ ఆయన చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. మహిళలు అత్యధికంగా సభకు తరలి వచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జోగేశ్వరరావు, ఏపీఎం నాగేశ్వరరావు, ఎంపీపీ బంక జయలక్ష్మి, వైస్ ఎంపీపీలు అచ్యుతశివాజీ, ఆరుగొల్లు మణి, జెడ్పీటీసీ సభ్యుడు ముప్పిడి లక్ష్మి, వైఎస్సార్ సీపీ మహిళా విభాగం నియోజకవర్గ అధ్యక్షురాలు గారపాటి రమాప్రభ, మండల శాఖ అధ్యక్షురాలు ఆరేళ్లలక్ష్మి, సొసైటీ అధ్యక్షులు కారుమంచి రమేష్,పెండ్యాల హరేరామకృష్ణ, నాయకులు బంక అప్పారావు, వెల్లంకి వెంకట సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

భావితరాలకు వివాదాలు లేని ఆస్తి

- ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు
- డ్రోన్ సాయంతో పట్టణంలో సమగ్ర భూ సర్వేకు శ్రీకారం



నిడదవోలులో డ్రోన్‌తో సమగ్ర భూసర్వేను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు, కౌన్సిలర్లు

నిడదవోలు రూరల్: భావి తరాలకు వివాదాలు లేని ఆస్తిని ఇచ్చేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్థిరాస్తుల సర్వే కోసం వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకంలో భాగంగా మీభూమి– మా హామీ కార్యక్రమాన్ని రూపొందించారని ఎమ్మెల్యే జి. శ్రీనివాస్‌నాయుడు అన్నారు. డ్రోన్ సహాయంతో సమగ్ర భూసర్వేను ఆయన నిడదవోలు పట్టణంలో ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు మాట్లాడుతూ సర్వే, రెవెన్యూ రికార్డుల వివరాలు, డిజిటల్ రూపంలో భూ కమత పటం, పట్టణ సర్వే పటం, రీసర్వే లాండ్ రిజిస్టర్, 1–బి రిజిస్టర్, శాశ్వత భూహక్కు పత్రాన్ని అందిస్తామన్నారు. భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం కోసం ప్రభుత్వం ఎన్నో సంస్కరణలు తీసుకు వచ్చిందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, వైస్ చైర్‌పర్సన్లు గంగుల వెంకటలక్ష్మి, యలగాడ బాలరాజు, కౌన్సిలర్లు కామిశెట్టి సత్యనారాయణ, ఎస్‌కే వజీరుద్దీన్, పువ్వల రతీదేవి, గోపిరెడ్డి శ్రీనివాస్, ఎండీ షకీరాబేగం, ఎ.భారతి, చిలకల శారదాదేవి, అహ్మదున్నీసాబేగం, వైఎస్సార్ సీపీ పట్టణ కార్యదర్శి గాజుల రంగారావు, నాయకులు ఎండీ ఫయాజ్, చాన్‌బాషా, మున్సిపల్ కమిషనర్ కేవీ పద్మావతి, టీపీఓ కె.సుజాత, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పల్లంట్లలో గోగులమ్మ వారి విగ్రహ ప్రతిష్ఠాపన



గోగులమ్మ తల్లిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే వెంకట్రావు తదితరులు

దేవరపల్లి: మండలంలోని పల్లంట్ల గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో ఆ గ్రామదేవత గోగులమ్మ వారి విగ్రహాన్ని ఆదివారం ప్రతిష్ఠించారు. గ్రామ పెద్ద కొయ్యలమూడి గాంధీ గ్రామ శివార్లలో స్థలాన్ని విరాళంగా ఇవ్వగా, గ్రామస్తుల సహకారంతో ఆలయ నిర్మాణాన్ని పూర్తి చేశారు. గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ గన్నమని జనార్దనరావు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కూచిపూడి సతీష్, సర్పంచ్ నూతలపాటి వెంకటరమణ, పార్టీ జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు మేడిబోయిన గంగరాజు, పార్టీ నాయకుడు యలమాటి భాస్కరరావు, పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో అన్నసమారాధన నిర్వహించారు.

ఉమా చోడేశ్వరునికి అభిషేకాలు



స్వామివారికి అభిషేకాలు చేస్తున్న పండితులు

కొవ్వూరు: స్థానిక పాతూరులోని ఉమాచోడేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయం గణపతి పూజ, స్వామివారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు చేశారు. పట్టణానికి చెందిన వేమూరి నాగేశ్వరరావు, వరలక్ష్మి దంపతుల చేతుల మీదుగా పూజలు జరిగాయి. అనంతరం బిల్వార్చన, రుద్రహోమం, అమ్మవారికి శ్రీసూక్త విధానంలో సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు కొతవరపు భాను, దేవరకొండ ఉమ, దేవరకొండ సాయి ప్రసాద్‌లతో పాటు పలువురు పండితులు పాల్గొన్నారు.

ఎస్సీల్లో చేర్చే తీర్మానం హర్షణీయం

- క్రిస్టియన్ ఫెడరేషన్ ఉమ్మడి గోదావరి జిల్లాల మహిళా అధ్యక్షురాలు మెర్సీ



వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఆలిండియా క్రిస్టియన్ ఫెడరేషన్ సభ్యులు

కొవ్వూరు: దళిత క్రైస్తవులను ఎస్సీల్లో చేర్చేందుకు వీలుగా రాష్ట్ర అసెంబ్లీలో తీర్మానం చేసి, ఆ బిల్లును పార్లమెంట్ ఆమోదం కోసం కేంద్ర ప్రభుత్వానికి పంపడం హర్షణీయమని ఆల్ ఇండియా క్రిస్టియన్ ఫెడరేషన్ ఉమ్మడి గోదావరి జిల్లాల మహిళా విభాగం అధ్యక్షురాలు కుమారపు మెర్సీ నగేష్ పేర్కొన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సాహసోపేత నిర్ణయం తీసుకున్నారన్నారు. ఆయన కృతజ్ఞతలు తెలుపుతూ క్రిస్టియన్ ఫెడరేషన్ నాయకులు పట్టణంలో ఆదివారం వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. దశాబ్దాలుగా దళిత క్రైస్తవులు బీసీ–సి కేటగిరీలో ఉండడంతో రిజర్వేషన్లకు దూరం కావాల్సి వస్తోందని ఈ సందర్భంగా మెర్సీ నగేష్ అన్నారు. ఈ బిల్లు పార్లమెంట్ ఆమోదం పొందితే దళిత క్రైస్తవులందరూ జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటామన్నారు. ఫెడరేషన్ నాయకురాలు నిర్మల రాజేంద్ర, హెలీనా విక్టోరియా ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కొవ్వూరు క్రైస్ట్ లూథరన్ టౌన్ చర్చి పాస్టర్ వారా జోసెఫ్, వి.ఆనందరావు, గుర్రే శరత్, నూతలపాటి మనోజ్‌కుమార్, కె.డానియేలు రాజు, వేము వెంకటరత్నం, ఇస్మాయిల్, సంఘ పెద్దలు, క్రిస్టియన్ ఫెడరేషన్ నాయకులు పాల్గొన్నారు.

ముగిసిన ఉగాది సంబరాలు



కొవ్వూరమ్మ ఆలయం వద్ద అన్న ప్రసాదం స్వీకరణకు బారులు తీరిన భక్తులు



నల్లజర్లలో లడ్డూ ప్రసాదాన్ని వేలంలో దక్కించుకున్న గంగాధరం

కొవ్వూరు: ఉగాది ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని కొవ్వూరమ్మ గుడి వద్ద, మెయిన్ రోడ్డులోని పుంతలో ముసలమ్మ గుడి వద్ద ఆదివారం అన్న సమారాధన నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై, భోజనాలు చేశారు. కుమారదేవం గ్రామంలోని గండి పోశమ్మ ఆలయం వద్ద ఉగాది ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ ఆలయం వద్ద సోమవారం వేలాది మందికి అన్నసమారాధన చేసేందుకు ఏర్పాట్లు చేశామని ధర్మకర్తల మండలి చైర్మన్ గంధం శ్రీనివాస్ తెలిపారు.

సోమాలమ్మ తల్లి ఉత్సవాలు

నల్లజర్ల: నల్లజర్ల గ్రామదేవతైన సోమాలమ్మ వారి ఉత్సవాలు ఆదివారంతో ముగిశాయి. ఉగాది నాడు ఈ ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. రోజూ అమ్మవారికి ప్రత్యేక పూజలు, భజనలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఉత్సవాల ముగింపు సందర్భంగా ఆదివారం నాలుగు వేల మందికి అన్నదానం చేశారు. ఈ సందర్భంగా అమ్మవారి లడ్డూ ప్రసాదానికి వేలం వేయగా మద్దిపాటి గంగాధరం దంపతులు రూ.19 వేలకు దక్కించుకున్నారు. ఆదివారం ఉదయం అమ్మవారికి కుంకుమ పూజలు జరిగాయి.

వీఆర్వోలపై పని ఒత్తిడి తగ్గించాలి

- సంఘం జిల్లా అధ్యక్షుడు సూర్యనారాయణ

కొవ్వూరు: గ్రామ రెవెన్యూ అధికారుల (వీఆర్వో)పై పని ఒత్తిడి తగ్గించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వీఆర్వోల సంఘం జిల్లా అధ్యక్షుడు కూచిమంచి సూర్యనారాయణ విజ్ఞప్తి చేశారు. వీఆర్వోల సంఘ జిల్లా స్థాయి సర్వసభ్య సమావేశాన్ని ఆదివారం సాయంత్రం స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో నిర్వహించారు. భూముల రీసర్వే ప్రక్రియకు అయ్యే ఖర్చును స్థానిక వీఆర్వోలతో చేయిస్తున్నారని సమావేశంలో ఆయనన్నారు. ఈ ఖర్చులను ప్రభుత్వమే భరించాలన్నారు. మాట వినని వీఆర్వోలను డిప్యుటేషన్ చేస్తూ వేధించడం సరి కాదన్నారు. గ్రేడ్–2 వీఆర్వోలకు ప్రొబేషనరీ డిక్లరేషన్ ఇవ్వాలని కోరారు. వీఆర్వోల సమస్యలపై మండలాల వారీగా సమావేశంలో సమీక్షించారు. సంఘ జిల్లా కార్యదర్శి సొంగా రాజు, కొవ్వూరు డివిజన్ అధ్యక్ష, ఉపాధ్యక్షులు ఏజర్ల ప్రభాకరరావు, బి.సర్వేశ్వరరావు, గౌరవాధ్యక్షుడు ముప్పిడి ప్రకాష్, రాజమహేంద్రవరం డివిజన్ అధ్యక్షుడు బి.శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు ఎస్.రాజాబాబు తదితరులు పాల్గొన్నారు.

పుంతలో ముసలమ్మకు విశేష పూజలు

చాగల్లు: ఊనగట్లలోని పుంతలో ముసలమ్మ అనే కనకమహాలక్ష్మి అమ్మవారి ఉగాది ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. అమ్మవారికి భక్తులు సమర్పించిన వస్త్రాలకు ఆదివారం రాత్రి వేలం వేశారు. ఆలయ ప్రాంగణంలో ఆదివారం రాత్రి సత్యహరిశ్చంద్ర నాటకాన్ని ప్రదర్శించారు. హరిశ్చంద్రుడిగా డి.రామసుబ్బారెడ్డి తన గాన మాధుర్యంతో ఆకట్టుకున్నారు. నక్షత్రకుడిగా బి.వాసు, విశ్వామిత్రుడిగా డి.దుర్గాప్రసాద్, చంద్రమతిగా ఎ.ప్రభావతి చక్కని నటనతో ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. గరప్పాడులోని ఆర్లమ్మ అమ్మవారి ఉగాది ఉత్సవాల ముగింపు సందర్భంగా ఆదివారం రాత్రి అన్నదానం చేశారు. గరప్పాడు, బ్రాహ్మణగూడెం, ఎస్.ముప్పవరం తదితర గ్రామాల భక్తులు హాజరై అమ్మవారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

కొవ్వూరులో కాంగ్రెస్ సత్యాగ్రహ దీక్ష

- రాహుల్ గాంధీ లోక్‌సభ సభ్యత్వం రద్దుకు నిరసన



దీక్ష చేస్తున్న పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ పద్మశ్రీ. పార్టీ జిల్లా అధ్యక్షుడు మార్టిన్ లూథర్ తదితరులు

కొవ్వూరు: కేంద్రం ప్రభుత్వం దేశాన్ని దోచుకోవడమే గాకుండా దొంగల ముఠాలను కాపాడుతోందని పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ సుంకర పద్మశ్రీ ఆరోపించారు. ఏఐసీసీ పిలుపు మేరకు జిల్లా కాంగ్రెస్ ఆధ్వర్యంలో కొవ్వూరులో ఆదివారం 'చేయి చేయి కలుపుదాం.. రాహుల్ గాంధీ నాయకత్వం బలపరుద్దాం' పేరుతో భారీ ర్యాలీ నిర్వహించారు. మెయిన్ రోడ్డులోని గాంధీజీ విగ్రహానికి పూలమాల వేసి బస్టాండ్ సెంటర్ వరకూ ర్యాలీ చేశారు.బస్టాండ్ సెంటర్లో ఏర్పాటు చేసిన శిబిరంలో వారందరూ సత్యాగ్రహ దీక్ష చేశారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కర్ణాటక ఎన్నికల వేళ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలను సవాలు చేస్తూ కోర్టులో కేసు వేసి, రెండేళ్ల జైలు శిక్ష విధింపజేసి, అడ్డగోలుగా రాహుల్ గాంధీ లోక్‌సభ సభ్యత్వాన్ని రద్దు చేయడాన్ని వారు తప్పుపట్టారు. పార్లమెంట్ నుంచి బహిష్కరించడాన్ని కుట్రగా అభివర్ణించారు. డీసీసీ అధ్యక్షుడు మార్టిన్ లూథర్, పార్టీ కొవ్వూరు ఇన్‌చార్జ్ అరిగెల అరుణకుమారి, గోపాలపురం, నిడదవోలు, అనపర్తి నియోజకవర్గాల ఇన్‌చార్జులు జ్యేష్ఠ సతీష్, పెద్దిరెడ్డి సుబ్బారావు, డాక్టర్ వడయార్, పీసీసీ ప్రతినిధి గెడ్డం సాయి బాబా, రాజమహేంద్రవరం సిటీ అధ్యక్షుడు కాలేపల్లి మురళి, హాత్‌సే హాత్ రాష్ట్ర ఇన్‌చార్జ్ ముళ్ల మాధవ్, పార్టీ మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల భాగ్యలక్ష్మి, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు డి.కిషోర్, పట్టణ శాఖ అధ్యక్షుడు గంధం బాజ్జీ తదతరులు పాల్గొన్నారు.

విజయనిర్మలకు విశ్వరూపిణి అవార్డు



అవార్డు అందుకుంటున్న విజయనిర్మల

దేవరపల్లి: విశ్వరూపిణి అంతర్జాతీయ ఉత్తమ మహిళా అవార్డుకు దేవరపల్లికి చెందిన నవచైతన్య యువజన సంఘం స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి, నారీ పురస్కార్ రాష్ట్రపతి అవార్డు గ్రహీత విజయనిర్మల ఎంపికయ్యారు. హైదరాబాద్‌లోని సరస్వతీ పరిషత్ కళామందిరంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో విజయనిర్మల ఈ అవార్డు స్వీకరించారు. సామాజిక, సేవారంగాల్లో చేసిన సేవలు, సాధించిన విజయాలను కొనియాడుతూ మహిళా అభివృద్ధి, సాధికారతకు ఆమె చేసిన కృషిని పరిగణనలోకి తీసుకుని అవార్డుకు ఎంపిక చేశారు. తన పేరును విక్టరీ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో ప్రత్యేక స్థానంలో నమోదు చేసి ధ్రువీకరణ పత్రం అందజేసినట్టు ఆమె చెప్పారు.

తాడిమళ్లలో అన్న సమారాధన

నిడదవోలు రూరల్: రజకుల బల్లల పండగను పురస్కరించుకుని మండలంలోని తాడిమళ్ల గ్రామంలో ఆదివారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి అన్నప్రసాదాన్ని స్వీకరించారు.